క్లుప్తంగా

మానసిక ఒత్తిడికి గురికావొద్దు



కామారెడ్డి టౌన్: విద్యార్థులు మానసిక ఒత్తిళ్లకు గురికావద్దని జిల్లా మెంటల్ హెల్త్ ఆఫీసర్, సైకియాట్రిస్ట్ రమణ సూచించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పరీక్షలు, మానసిక ఒత్తిడిపై అవగాహన కల్పించారు. సమయానికి నిద్ర, ఆహారం తీసుకుంటూ అనువైన స్థలాన్ని ఎంచుకొని చదువుకోవాలన్నారు. సమస్యలు వస్తే ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు చెప్పాలన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): వదల్‌పర్తి శివారులో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన ఫిష్ పాండ్ పనులను సోమవారం ఎంపీడీవో రఘు పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీల హాజరుకు సంబంధించిన మస్టర్లను ఆయన తనిఖీ చేశారు. నిబంధనల ప్రకారం పనులు చేపట్టాలని కూలీలకు సూచించారు.వదల్‌పర్తి సర్పంచ్ ప్రవీణ్, పంచాయితీ కార్యదర్శులు అజీమొద్దీన్, నర్సింలున్నారు.

కంటి వెలుగు శిబిరం..

దోమకొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న కంటి వెలుగు శిబిరాన్ని సోమవారం జెడ్పీటీసీ సభ్యులు తీగల తిర్మల్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇప్పటివరకు శిబిరంలో 2,456 మందికి కంటి పరీక్షలు నిర్వహించి వారిలో 590 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశామన్నారు. కంటి శిబిరం ఇన్‌చార్జి వైద్యాధికారి మారుతి, కంటి వైద్యురాలు ప్రవళిక, తదితరులు ఉన్నారు.

లింగారెడ్డిపేటలో వరి పంటలు..

ఎల్లారెడ్డి: మున్సిపాలిటీ పరిధిలోని లింగారెడ్డిపేటలో వరి పంటలను ఏఈవో రాజాగౌడ్ సోమవారం పరిశీలించారు. వరి పంటలకు అగ్గి తెగులు సోకిందని.. దీని నివారణకు ఐసోప్రోతిలిన్ ద్రావణం 200 మిల్లీ లీటర్లు ఎకరాకు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు.

ఉత్తునూర్‌లో మొక్కజొన్న..

సదాశివనగర్(ఎల్లారెడ్డి): ఉత్తునూర్‌లో మొక్కజొన్న పంటలను సోమవారం మండల వ్యవసాయాధికారి ప్రజాపతి పరిశీలించారు. పంట అధిక దిగుబడి కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.

బ్రిడ్జి నిర్మాణ పనులు..

ఎల్లారెడ్డి: మున్సిపాలిటీ పరిధిలోని గండిమాసానిపేటలో పోచారం కాలువపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, నీటి పారుదల శాఖ డీఈఈ వెంకటేశ్వర్లుతో కలిసి సోమవారం పరిశీలించారు. గ్రామంలో పోచారం కాలువపై పాత వంతెన శిథిలావస్థకు చేరుకోవడంతో దాని స్థానంలో రూ. 62 లక్షలతో కొత్త వంతెన నిర్మిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ తెలిపారు. కౌన్సిలర్లు రాము, సాయిలు తదితరులున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

బాన్సువాడ రూరల్: ఇబ్రహీంపేట్, ఇబ్రహీంపేట్ తండా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను సోమవారం ఎంపీపీ నీరజా వెంకట్రాంరెడ్డి తనిఖీ చేశారు. చిన్నారుల కోసం సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి వడ్డించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, పోషకాలతో కూడిన ఆహారం అందించాలని సూచించారు. . సర్పంచ్ మాలెపు నారాయణరెడ్డి, ఎంపీటీసీ కళావతి తదితరులున్నారు.

షర్మిల పాదయాత్రతో బీఆర్‌ఎస్‌లో వణుకు



కామారెడ్డి టౌన్: రాష్ట్రంలో వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల చేస్తున్న పాదయాత్రతో బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో వణుకు పుడుతోందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నీలం సుధాకర్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ నాయకులు పాదయాత్రకు వస్తున్న ఆదరణను చూసి జీర్ణించుకోలేకపోతున్నారని వ్యాఖ్యానించారు. ప్రభుత్వానికి మహిళల పట్ల కనీస మర్యాద లేదని అన్నారు. నాయకులు పెద్ద పోతన్నగారి రాము, ఎండీ తాహేర్, సంగమేశ్వర్, శ్రీనివాస్, రాజు ఉన్నారు.

గుర్తింపు రావడం హర్షణీయం

బాన్సువాడ టౌన్: బాన్సువాడ మాత శిశు ఆస్పత్రికి జాతీయ గుర్తింపు రావడం హర్షణీయమని 108 సిబ్బంది అన్నారు. సోమవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్‌ప్రసాద్‌ను 108 ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. డబ్ల్యూహెచ్‌వో ఆధ్వర్యంలో బీఎఫ్‌హెచ్‌ఐ అక్రిడేషన్ పొందడానికి కృషి చేసిన శ్రీనివాస్ ప్రసాద్‌కు, సిబ్బందికి ప్రత్యేక అభినందనలని అన్నారు. కార్యక్రమంలో 108 సిబ్బంది లక్ష్మణ్, శివ, సుభాష్, రాజు, రమేష్, పుండరీకం, రాము తదితరులు ఉన్నారు.

వంద శాతం వసూలే లక్ష్యం

- ఇంటి పన్ను వసూళ్లపై పంచాయతీ సిబ్బంది ప్రత్యేక దృష్టి
- ఇప్పటి వరకు 65 శాతానికి పైగా పూర్తి



చిన్నమల్లారెడ్డిలో ఇంటి పన్ను వసూలు చేస్తున్న పంచాయతీ సిబ్బంది

కామారెడ్డి రూరల్: పల్లెలు అభివృద్ధి దిశగా పురోగమించాలంటే గ్రామ ప్రజలే కీలకం. వారు చెల్లించే పన్నుల ఆధారంగా గ్రామాలు సమగ్రాభివృద్ధి చెందుతాయి. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు, అభివృద్ధి పనులను చేపట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న 14వ ఆర్థిక సంఘం నిధులు, ఎస్‌ఎఫ్‌సీ నిధులతోపాటు గ్రామాల్లో ఇంటి పన్నులతోపాటు వాణిజ్య సముదాయాలు చెల్లించే పన్నులు కీలకంగా మారతాయి. ప్రజలకు వసతులు కల్పించాలంటే ఇందుకు అవసరమైన నిధుల కోసం గ్రామాల్లో ప్రతి సంవత్సరం ఇంటి పన్ను వసూలు చేయడం తప్పనిసరిగా భావిస్తున్నారు. ఇంటి పన్ను వందశాతం వసూలు చేయాలని పంచాయతీ సిబ్బంది నిర్ణయించారు. ఇప్పటికే మండలంలోని ఆయా గ్రామాల్లో అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందితో ఇంటింటికి తిరుగుతూ ఇంటి పన్ను వసూలు చేస్తున్నారు. ఇప్పటికే 65 శాతానికి పైగా పూర్తి చేశారు. రాఘవాపూర్‌లో 100 శాతం పన్నులు వసూలు అయ్యాయి.

14 జీపీల్లో ముమ్మరంగా పన్నుల వసూళ్లు..

కామారెడ్డి మండలంలో 14 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. గత ఆర్థిక సంవత్సరం 100 శాతం ఇంటి పన్ను వసూలు చేశారు. 2022–2023 ఆర్థిక సంవత్సరం మార్చి 31తో ముగియనుండడంతో గ్రామాల్లో ఇంటి పన్ను వసూలుపై పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఇప్పటికే 65 శాతానికి పైగా పన్ను వసూలు చేశారు. 9 గ్రామ పంచాయతీల్లో 90 నుంచి 95 శాతం వరకు పూర్తయ్యాయి. పెద్ద గ్రామ పంచాయతీల్లో మార్చి 31 వరకు 100 శాతం పన్నులు వసూలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సంవత్సరం మండలంలోని అన్ని గ్రామాల్లో 100 శాతం పన్ను వసూలు చేయడానికి ప్రజాప్రతినిధుల సహకారంతో అధికారులు ప్రజలకు అవగాహన కల్పించి ఇంటి పన్ను వసూలు చేయడానికి ప్రయత్నిస్తున్నారు.

ప్రజలు సహకరించాలి



గ్రామాల్లో పేరుకుపోయిన బకాయిల వసూలుకు ప్రజలు సహకరించాలి. ఇప్పటికే ఒక గ్రామ పంచాయతీలో వందశాతం వసూలు చేశాం. మరో 9 గ్రామ పంచాయతీల్లో 90 నుంచి 95 శాతం పూర్తయ్యాయి. ఈ నెలాఖరు వరకు మిగతా పంచాయతీల్లోనూ స్పెషల్ డ్రైవ్‌తో వందశాతం వసూలు చేస్తాం. ప్రజలు కట్టే డబ్బులతోనే గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతాం. ప్రజలు పన్నులు కట్టి అధికారులకు సహకరించాలి. పన్నులు చెల్లిస్తేనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుంది.

–మలహరి, ఎంపీవో, కామారెడ్డి

మత్స్యకారులకు వృత్తి నైపుణ్యత పరీక్షలు



పరీక్షలో పాల్గొన్న మత్స్యకారులు

లింగంపేట(ఎల్లారెడ్డి): కన్నాపూర్ ఊర చెరువులో సోమవారం మత్స్యకారులకు వృత్తి నైపుణ్యత పరీక్షలు నిర్వహించినట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి వరదారెడ్డి తెలిపారు. కన్నాపూర్ గ్రామానికి చెందిన 48 మంది, శెట్పల్లిసంగారెడ్డి 75 మంది, కొండాపూర్ గ్రామానికి చెందిన 10 మందికి నైపుణ్యత పరీక్షలు నిర్వహించినట్లు వెల్లడించారు. రాష్ట్ర మత్స్యశాఖ ఆదేశానుసారం రెండో విడత మత్స్య సహకార సంఘం సభ్యత్వం 18 సవత్సరాలు నిండిన వారికి అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీనివాస్, ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు బట్టు విఠల్, మండల అధ్యక్షుడు సాయికుమార్, ఎంపీటీసీలు సాయికిరణ్, వెంకటి, సర్పంచ్ గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



కామారెడ్డి రూరల్: చిన్న మల్లారెడ్డి, కొటాల్‌పల్లి, క్యాసంపల్లి తండా గ్రామాల్లో రూ.60 లక్షలతో సీసీ రోడ్డు పనులను ఎంపీపీ పిప్పిరి ఆంజనేయులు సోమవారం ప్రారంభించారు. చిన్న మల్లారెడ్డిలో రూ.40 లక్షలు, కోటాల్‌పల్లిలో రూ.పది లక్షలు, క్యాసంపల్లి తండాలో రూ.10 లక్షలతో పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చిదుర రమాదేవి లక్ష్మారెడ్డి, మాజీ జెడ్పీటీసీ నిమ్మమోహన్ రెడ్డి, చిన్న మల్లారెడ్డి మాజీ సర్పంచ్ గట్టగోని రామా గౌడ్, సర్పంచ్‌లు క్రిష్ణాజిగారి రత్నాబాయి ఆనంద్‌రావు, జొనకంటి మంజుల బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూరు పరిధిలో..



భిక్కనూరు: కామారెడ్డి ఎమ్మెల్యే గంప గోవర్ధన్ చొరవతో మండలం వేగంగా అభివృద్ధి చెందుతోందని ఆత్మకమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి అన్నారు. సోమవారం ఆయన రామేశ్వర్‌పల్లి, ర్యాగట్లపల్లి, గుర్జకుంట గ్రామాల్లో రూ.10 లక్షల చొప్పున ఎమ్మెల్యే మంజూరు చేసిన నిధులతో నిర్మించనున్న సిమెంట్‌రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ పోతిరెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ ఎడ్ల రాజిరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ హన్మంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తుడుందెబ్బ నేతల దాడి అప్రజాస్వామికం



బాన్సువాడ రూరల్: ఉట్నూర్‌లోని ఐటీడీఏ కార్యాలయంపై తుడుందెబ్బ నాయకులు దాడి చేయడం అప్రజాస్వామికమని బంజారా సేవా సంఘం మండల అధ్యక్షులు రామూరాథోడ్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలనే డిమాండ్‌తో వారు ఐటీడీఏ చైర్మన్ వాహనాన్ని, ఆఫీస్ ఫర్నీచర్‌ను ధ్వంసం చేయడం బాధాకరమన్నారు. విద్వేషాలు రెచ్చగొట్టేలా తుడుందెబ్బ నాయకులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తుడుందెబ్బ నాయకుల చర్యలను యావత్ ఎస్టీ సమాజం తీవ్రంగా ఖండించి ఐక్యంగా ముందుకు సాగాలని కోరారు.

గ్రామ అభివృద్ధిపై వివక్ష



వినతి పత్రం అందిస్తున్న సర్పంచ్, వార్డు సభ్యులు

మద్నూర్(జుక్కల్): తమ గ్రామానికి నిధులు కేటాయించకుండా వివక్ష చూపుతున్నారని హండేకేలూర్ సర్పంచ్ నీలావతి ఆరోపించారు. సోమవారం హండేకేలూర్ సర్పంచ్ నీలావతి, వార్డు సభ్యులు, గ్రామస్తులతో కలిసి ఎంపీడీవో రవీశ్వర్‌గౌడ్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. రెండేళ్లుగా ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల ద్వారా వచ్చే సీసీ రోడ్లు మంజూరు కాకుండా వివక్ష చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిధులు మంజూరు చేయకపోతే ధర్నా చేస్తామని హెచ్చరించారు.

ఆధ్యాత్మికం

■ త్రిలింగేశ్వరాలయంలో భజనకీర్తనలు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మహాశివరాత్రి ఉత్సవాలలో భాగంగా తాండూర్ శివారులోని త్రిలింగేశ్వరాలయంలో ఆదివారం రాత్రి సోమవారం ఉదయం వరకు భక్తులు భజనకీర్తనలను ఆలపించారు. స్థానికులతో పాటు మెదక్, సంగారెడ్డి జిల్లాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు.

■ కిటకిటలాడిన రాజరాజేశ్వర ఆలయం

పిట్లం(జుక్కల్): మండలంలోని రాజరాజేశ్వర ఆలయం మహాశివరాత్రి సందర్భంగా సోమవారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుండే భక్తులు ఆలయానికి బారులు తీరారు. బోనాలతో ఆలయానికి చేరుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

■ తిమ్మాపూర్‌లో బోనాల పండగ

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): తిమ్మాపూర్‌లో బోనాల పండగను నిర్వహించారు. మహాశివరాత్రి ఉత్సవాలలో భాగంగా ముత్యాల పోచమ్మ, నల్ల పోచమ్మ, ఎల్లమ్మ అమ్మవార్లకు మహిళలు బోనాలతో శోభాయాత్ర నిర్వహించి బోనాలను సమర్పించారు.



తిమ్మాపూర్‌లో బోనాలతో శోభాయాత్ర

■ ఎల్లారెడ్డిలో సోమావతి అమావాస్య వ్రతాలు

ఎల్లారెడ్డిరూరల్/పిట్లం: ఎల్లారెడ్డి పట్టణంలోని సాయిబాబా ఆలయంలో, పిట్లం మండల కేంద్రంలోని హన్మాన్ ఆలయంలో సోమవారం సోమావతి అమావాస్య వ్రతాలు, ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఎల్లారెడ్డిలో రావి, వేప చెట్టులకు కల్యాణం చేసిన అనంతరం అన్నదానం చేశారు.

పిట్లం(జుక్కల్): పోతురెడ్డిపల్లి హనుమాన్ ఆలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు తేజ స్వామి మాట్లాడుతూ.. అమావాస్య సందర్భంగా ప్రజలందరు సుఖ సంతోషాలతో ఉండాలని ఆలయంలో రుద్ర హోమం, అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉత్సాహంగా కుస్తీ పోటీలు



సంగంలో కుస్తీలు పడుతున్న మల్లయోధులు

లింగంపేట/నస్రుల్లాబాద్/ఎల్లారెడ్డిరూరల్:జిల్లాలో సోమవారం లింగంపేట మండలం కొర్పోల్, ఎల్లారెడ్డి మండలం అడివిలింగాల, నస్రుల్లాబాద్ మండలం సంగం గ్రామాల్లో కుస్తీ పోటీలు నిర్వహించారు. పోటీలను తిలకించడానికి చుట్టపక్కల గ్రామాల నుంచి భారీగా ప్రజలు తరలివచ్చారు. విజేతలకు నగదు బహుమతులు అందజేశారు.

సమాచారం..

■ నేడు ఉగ్రవాయిలో ఉచిత పశువైద్య శిబిరం

కామారెడ్డి రూరల్: కామారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 21న మంగళవారం ఉదయం 7.30 నుంచి 11 గంటల వరకు ఉగ్రవాయిలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ పిప్పిరి వెంకటి, వైస్ చైర్మన్ కుంబాల రవి యాదవ్‌లు తెలిపారు.

■ శనగ కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

మద్నూర్(జుక్కల్): మద్నూర్, డోంగ్లీ సింగిల్ విండోల పరిధిలో మంగళవారం ప్రభుత్వ శనగ పంట కొనుగోలు కాంటాలు ప్రారంభమవుతాయని మండల వ్యవసాయ అధికారి రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శనగ క్వింటాల్‌కు రూ.5,335తో కొనుగోలు చేస్తామని తెలిపారు.

■ భిక్కనూరుకు వైద్యారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ రాక

భిక్కనూరు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రాష్ట్ర వైద్యారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ శ్వేత మహంతి మంగళవారం విచ్చేస్తున్నారు. ఉదయం స్థానిక పీహెచ్‌సీలో న్యూట్రిషన్ కిట్ల వినియోగం, పంపిణీపై సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు.

ప్రజా సంక్షేమం కోసం బీజేపీ రావాల్సిందే



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

కామారెడ్డి టౌన్: రాష్ట్రంలో ప్రజల సంక్షేమం కోసం బీజేపీ అధికారంలోకి రావాల్సిందేనని బీజేపీ రాష్ట్ర నాయకుడు, ఆల్ ఇండియా కోల్ అండ్ మైనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ మురళీధర్ గౌడ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని 27వ వార్డులో ప్రజా గోస బీజేపీ భరోసా స్ట్రీట్ కార్నర్ సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తుందని చెప్పారు. బీజేపీని తిట్టడానికే మంత్రులు, ఎమ్మెల్యేలు, సీఎం పని చేస్తున్నారని మండిపడ్డారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. నాయకులు ఎంజీ వేణుగోపాల్ గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నీలం చిన్నరాజులు, మాజీ కౌన్సిలర్ జూలూరి సుధాకర్ పాల్గొన్నారు.

దర్యాప్తు సంస్థలు దుర్వినియోగం



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు

కామారెడ్డి అర్బన్: కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థలైన ఈడీ, సీబీఐ, ఐటీ శాఖలను ప్రధాని మోదీ దుర్వినియోగం చేస్తూ ప్రతిపక్షాలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆమ్ ఆద్మీ పార్టీ కామారెడ్డి జిల్లా కన్వీనర్ మదన్‌లాల్ జాదవ్ ఆరోపించారు. సోమవారం కామారెడ్డిలో ఆయన మాట్లాడారు. మోదీ పాలన లోపాలను ప్రశ్నించేవారిని కేసులతో వేధించడం మానుకోవాలని హితవు పలికారు. అవినీతిపై పోరాటం చేసే ఆప్ జాతీయ అధ్యక్షుడు అరవింద్ కేజ్రీవాల్‌ను లిక్కర్ కేసులో ఇరికించడం భావ్యం కాదన్నారు. కేంద్రానికి వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించారు.

వరిలో తడి పొడి విధానంపై అవగాహన



లింగంపేట(ఎల్లారెడ్డి): రాంపల్లి, రాంపల్లి స్కూల్ తండా రైతులకు సోమవారం వరిలో తడి పొడి విధానంపై అవగాహన కల్పించినట్లు పద్మపాని స్వచ్ఛంద సంస్థ జిల్లా కో–ఆర్డినేటర్ రాజేందర్ తెలిపారు. తడి పొడి విధానం సాగులో మెలకువలు, నీటి పొదుపు, వినియోగం, తెగుళ్ల నివారణ, దోమపోటు నివారణ, మీథేన్ వాయువు తగ్గింపు, వరిలో వేర్లకు ఆక్సిజన్ అందడం, ధృఢమైన వేరు వ్యవస్థ, అధిక పిలకలు రావడం తదితర విషయాలపై వివరించారు. సర్పంచ్‌లు సాయిలు, పరుశురాం, ఉపసర్పంచ్ లక్ష్మి బాయి, కార్యదర్శి విఠల్ పాల్గొన్నారు.

శివాజీ అడుగు జాడల్లో నడవాలి



మద్నూర్‌లో రక్తదానం చేస్తున్న స్థానికులు

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో సోమవారం ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిలో భాగంగా శివాజీ సార్వజనిక్ ఉత్సవ్ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిజామాబాద్, బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రుల వైద్య సిబ్బంది దాతల నుంచి రక్తాన్ని సేకరించారు. మొత్తం 64 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు మెడికల్ ఆఫీసర్ శివదాస్, బ్లడ్ బ్యాంక్ పీఆర్వో ఆనంద్‌లు పేర్కొన్నారు. గ్రామ సర్పంచ్ సూర్యకాంత్ పాల్గొని మాట్లాడుతూ..శివాజీ వీరత్వాన్ని యువత ఆదర్శంగా తీసుకొని ఆయన అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు.

మజీద్ స్థల సమస్యను పరిష్కరించండి



పిట్లం(జుక్కల్): కారేగాంలో మజీద్ నిర్మాణ స్థలం సమస్యను పరిష్కరించాలంటూ గ్రామస్తులు సోమవారం తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ రామ్మోహన్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..గ్రామంలో ప్రార్థనలు చేసుకోడానికి మజీద్ లేకపోవడంతో మైనార్టీలు వేరే గ్రామాలకు వెళ్లాల్సి వస్తుందని వాపోయారు. గతంలో గ్రామ పెద్దల సమక్షంలో మజీద్ నిర్మాణానికి ఒక స్థలాన్ని చూపెట్టామని, అయితే ఆ స్థలంలో మజీద్ నిర్మాణానికి పలువురు అడ్డుకుంటున్నారని అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి స్థల సమస్యను పరిష్కారించాలని కోరారు.

పేదోడి సొంతింటి కల నెరవేరుస్తాం

- కాంగ్రెస్ నేత సుభాష్‌రెడ్డి



ప్రజలతో మాట్లాడుతున్న సుభాష్‌రెడ్డి

గాంధారి(ఎల్లారెడ్డి): కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పేదోడి సొంతింటి కల నెరవేరుస్తామని కాంగ్రెస్ నేత, ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి సుభాష్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా పాతంగల్ కలాన్, పోతంగల్ కుర్దు, ముదెల్లి, గండివేట్, చెన్నాపూర్, సర్వాపూర్ తదితర గ్రామాల్లో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి సమస్యలను తెలుసుకున్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని ఆరోపించారు. నియోజకవర్గంలో ఏ ఊరిలో చూసినా ఒక్క డబుల్ బెడ్రూం ఇంటి జాడ లేదన్నారు. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లే కనపడుతున్నాయన్నారు. ఎంపీటీసీ కామెల్లి బాల్‌రాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం..

■ తేలికపాటి వాహన యజమానుల కార్యవర్గం



కామారెడ్డి రూరల్: జిల్లా తేలిక వాహన(లైట్ వెయిట్) యజమానుల సంఘ నూతన కార్యవర్గాన్ని సోమవారం స్థానిక ఇందిరాగాంధీ స్టేడియంలో ఎన్నుకున్నారు. శాశ్వత గౌరవ అధ్యక్షుడిగా మాజిద్, అధ్యక్షుడిగా నీలేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా సంతోష్, సెక్రటరీగా రియాజ్, జాయింట్ సెక్రటరీగా ఎజాజ్, కోశాధికారిగా సంతోష్‌గౌడ్‌లను ఎన్నుకున్నారు. అనంతరం నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ.. సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

■ పద్మశాలి మండలాధ్యక్షుడిగా బిట్ల శంకర్



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి చెందిన బిట్ల శంకర్ ఏకగ్రీవంగా మూడో సారి పద్మశాలి సంఘం మండలాధ్యక్షుడిగా ఎన్నికై హ్యాట్రిక్ సాధించారు. సోమవారం పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీగాథ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా బిట్ల శంకర్ మాట్లాడుతూ.. తనకు మూడోసారి మండల అధ్యక్ష పదవీ బాధ్యతలు ఇచ్చినందుకు ఉత్తమ సేవలందిస్తానన్నారు. సంఘం గ్రామ అధ్యక్షుడు చౌకి నాగరాజు, ప్రతినిధులు రాజయ్య, ధర్మపురి, భూమేశ్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

తెలంగాణ అమరవీరుడు యాదయ్య 13వ వర్ధంతి

కామారెడ్డి టౌన్: తెలంగాణ అమరవీరుడు సిరిపురం యాదయ్య 13వ వర్ధంతిని జిల్లా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సంఘం జిల్లా అధ్యక్షులులక్ష్మీనర్సింలు పాల్గొన్నారు.

భిక్కనూరు పీహెచ్‌సీకి ఎన్‌క్యూఎస్ సర్టిఫికేట్

భిక్కనూరు: మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి ఎన్‌క్యూఎస్(నేషనల్ క్వాలిటీ కంట్రోల్ సర్టిఫికేట్)ను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఉత్తర్వులు సోమవారం భిక్కనూరు పీహెచ్‌సీకి అందాయి. సర్టిఫికెట్ రాకతో ప్రతి ఏడాది ఆస్పతి అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.3 లక్షలు మంజూరు చేస్తుంది.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

పెద్దకొడప్‌గల్(జుక్కల్): కంటి సమస్యలున్నవారు కంటి వెలుగు కార్యక్రమన్ని సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ చంద్ర బాగా తెలిపారు. సోమవారం పెద్ద దేవిసింగ్ తండాలో కంటి వెలుగును ఆయన ప్రారంభించారు.ఎంపీపీ ప్రతాప్ రెడ్డి, డాక్టర్ ఉమాకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

బాలికల పాఠశాలలో స్వయం పాలన దినోత్సవం

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం స్వయం పాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థినులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలను బోధించారు. ఉత్తమంగా బోధించిన విద్యార్థినులకు బహుమతులను అందజేశారు.

అపరాధ రుసుముతో 22 లోపు చెల్లించవచ్చు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): ఈ విద్యా సంవత్సరాంలో ఓపెన్ పది, ఇంటర్‌లలో ప్రవేశం పొందిన అభ్యర్థులు పరీక్ష ఫీజును అపరాధ రుసుముతో ఈ నెల 22 వరకు చెల్లించవచ్చని మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్టడీ సెంటర్ అసిస్టెంట్ కో–ఆర్డినేటర్ గంగా కిషన్ తెలిపారు. సమాచారం కోసం 9866343898 సంప్రదించాలన్నారు.

పశువుల యజమానులు స్పందించకుంటే చర్యలు

కామారెడ్డి టౌన్: లంపి స్కిన్ వ్యాధి సోకుతున్న తరుణంలో రోడ్లపై ఉన్న పశువులను వాటి యజమానులు తీసుకెళ్లాలని మున్సిపల్ సానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్ సోమవారం తెలిపారు. జిల్లా కేంద్రంలో ప్రధాన రోడ్లపై ఆవులు సంచరిస్తున్నాయని వాటికి వైరస్ సోకుతుందన్నారు. పశుసంవర్ధక శాఖ అధికారులు వాటికి టీకాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని యజమానులు పశువుల కొట్టాలలో ఉంచాలన్నారు. రోడ్లపై వదిలివేయవద్దని హెచ్చరించారు.

మన గ్రోమోర్‌లో రైతుల గొడవ

నస్రుల్లాబాద్(బీర్కూర్): బీర్కూర్ మండలంలోని ఆయా గ్రామాల్లో యూరియా కొరత ఉండటంతో మండల కేంద్రంలోని మన గ్రోమోర్‌కు రైతులు పెద్ద సంఖ్యలో వెళ్లారు. దీనితో సంబంధిత గ్రోమోర్ వ్యక్తులు యూరియాతో పాటు ఇతర ఎరువులు, పురుగుల మందులు కొనాలంటున్నారని వాగ్వాదానికి దిగారు.

బాన్సువాడ డీఎంను కలిసిన బీజేపీ నాయకులు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): బాన్సువాడ డిపో మేనేజర్ సదాశివ్‌ను బీజేపీ నేతలు సామెల్, విద్యాసాగర్‌లు కలిశారు. ఎల్లారెడ్డి నుంచి బాన్సువాడకు ఉదయం 7 గంటల నుంచి 9 వరకు, హైద్రాబాద్ నుంచి ఎల్లారెడ్డికి సాయంత్రం 5 తర్వాత బస్సులు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని వారు విన్నవించారు. బస్సుల సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని మేనేజర్ హామీ ఇచ్చినట్లు నేతలు తెలిపారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కామారెడ్డి & ఎల్లారెడ్డి
96034 62494
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
యం. మధుసూదన్ (ACO) : 9951027699
ఎల్లారెడ్డి: డి.యల్.ఎమ్. గౌడ్ : 9573130288
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899